

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 69 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 08, ఫిబ్రవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



# అప్పుల బాధ అధికమవుతుండె !



## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిపోతున్న అప్పులు



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

రాష్ట్ర ఆదాయాలకు మించిన అప్పులు చేస్తున్నారు

రెండు సంవత్సరాల కాలంలో సుమారు మూడు లక్షలకోట్లకు పైన అప్పులు పెరిగిపోయాయి

ప్రజా సంక్షేమాల పేరు మినహాయిస్తే అన్ని కాంట్రాక్టు పనులే

పెరిగిపోతున్న అప్పులు తరిగిపోతున్న అభివృద్ధి

ఐదు సంవత్సరాల కాలపరిమిది కోసం లక్షల కోట్ల అప్పు చేస్తున్నారు

దేశంలో అప్పుల పేరు చెప్పి దోచుకుంటున్నారు రాష్ట్రాల పరిస్థితి ఏంది

అభివృద్ధికి నోచుకోక నైతికంగా దెబ్బతింటున్న ప్రజలు

ఒక్క టర్మ్ పాలిస్తే చాలు బోలెడు సొమ్ము వెనకేసుకుంటున్నారు

దినదినం ఘండంగా పెరిగిపోతున్న ప్రజల ఇబ్బందులు : డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ప్రజా సంక్షేమాల అభివృద్ధి పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తూ ప్రజలను తిప్పలు పెడుతున్నాయని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా విమర్శించారు.తెలుగు రాష్ట్రాలలో స్థాయికి మించి అప్పులు చేస్తున్నారని వాటివల్ల తెలుగు ప్రజలపై పడరాని అప్పుల భారం పడుతుందన్నారు.తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పరిపాలన సాగించడానికి ప్రభుత్వ భూములను వేలం వేస్తూ ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతూ వచ్చినటువంటి ఆదాయంతో ప్రభుత్వాల నడిపించాల్సిన పరిస్థితిలు ఏర్పడుతున్నాయన్నారు.ఆదర్శం అనేది అన్ని వైపులా అభివృద్ధి చెందాలి గాని రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తామంటూ ఎన్ని వర్గాల ప్రజలను నమ్మిస్తూ స్థాయికి మించిన హక్కులను చేస్తూ అభివృద్ధిని మర్చిపోవడం ప్రజాసేవను పూర్తిగా విస్మరిస్తున్నట్లుగా ఉందన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్పష్టతను ప్రభుత్వాలు మర్చిపోతున్నట్లుగా కనిపిస్తుందన్నారు.తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా చీకటి ఒప్పందాలతో చెలరేగిపోతున్న వ్యాపారాలను చూస్తుంటే ప్రభుత్వ సొమ్మును కోస్థాయిలో

- మిగతా 2లో..

## గోదావరి జలాలతో తాండూరు.. పరిగి.. వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2




గోదావరి జలాలను వినియోగించి తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే వచ్చే మూడేళ్లలో మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



## తెలంగాణలో ఆ ఉద్యోగులకు పోలీస్ శాలరీ ప్యాకేజీ




ఎస్బీఐతో ప్రభుత్వ ఒప్పందం

టీజీఎస్పీఎఫ్ సిబ్బందికి పోలీసు శాలరీ ప్యాకేజీ అమలుకు ప్రభుత్వం నిర్ణయం

ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి కోటి రూపాయల బీమా సౌకర్యం

సిబ్బంది పిల్లల చదువులు, కుమార్తెల వివాహాలకు ఆర్థిక సాయం

పలు రుణ, బ్యాంకింగ్ ప్రయోజనాలు కూడా వర్తింపు

2

## విద్యుత్ కనెక్షన్ పొందడం సులభం

8

ఫిక్స్డ్ ఛార్జీల విధానం అమలు

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం



ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

ప్రపంచవ్యాప్తంగా కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ కుంభకోణంతో పోల్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ప్రమాదం అనుమానాలకు తావిస్తోందన్న బీఆర్ఎస్ నేత

ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని ట్వీట్

2



## ‘ఫోన్ ఇన్’... హైడ్రా కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు చెప్పిన ప్రజలు

హైడ్రా కార్యాలయంలో తొలిసారి ఫోన్ ఇన్ కార్యక్రమం

రంగనాథ్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన 36 మంది

ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం ఓఆర్ఆర్ బయటకు విస్తరించాలని కోరిన ప్రజలు

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# "అప్పుల "బాధ" అధికమవుతుండె

మొదటి పేజీ తరువాయి

కాంట్రాక్టు పనులకు వాడుతున్నారన్నారు.ప్రభుత్వాల ఖజానా ఖాళీ అవుతున్న కొద్దీ అప్పులు పెరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజాసేవల పేరు మీద నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధుల రివ్యూ సమావేశాలకు బహిరంగ సభలకు ప్రోటోకాల్ సమావేశాలకు లెక్కలేనంత సొమ్మును ఖర్చు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.ఇంచుమించు మూడు లక్షల కోట్లు దాటుతున్న అప్పులు చూస్తుంటే ప్రభుత్వం తడిచి మోపడయ్యె ఖర్చులు పెడుతుందని దానిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం ఆర్బీఐ నుండి మరొక తొమ్మిది వేల కోట్ల రూపాయలు అప్పుకు సిద్ధపడుతున్న ప్రభుత్వం అంత పెద్ద సొమ్మును దేనికొరకు అపుచేస్తుందో ప్రజలకు తెలపలేకపోతుందన్నారు.ప్రతి పైస రూపంలో చేయబడుతున్న అప్పు ఖర్చుల లెక్కల ఆధారాలను ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రాల్లో పొందుపరుస్తుండడం వల్ల ప్రభుత్వాలపై ప్రజలకు కాస్తయిన నమ్మకం పెరుగుతుందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వాలు పాలిస్తున్న తీరు పట్ల ప్రజలకు పూర్తిగా విశ్వాసం సన్నగిల్లుతుందని దానికి ప్రధానమైన కారణాలను పరిశీలిస్తుండగా ప్రభుత్వాలు పాలిస్తున్న తీరుపట్ల ప్రభుత్వ కార్యాలయాలలోని ఆధారాలను ఎక్కడెక్కడే మాయం చేస్తున్నారని వాటితో పాటు తెలంగాణ రాష్ట్ర సచివాలయ కేంద్రం ఆధారంగా విడుదల చేస్తున్న అభివృద్ధి పనుల ఆధారాలను మాయం చేస్తూ తర్జుమాలుతున్న సొమ్ము లెక్కలను కనబడకుండా చేస్తున్నారన్నారు.దీన్ని బట్టి చూస్తే ప్రజల సొమ్మును ఎక్కడికక్కడే ఖర్చులు చేస్తూ ఆదాయానికి మించిన అప్పులు చేస్తూ లెక్కల ఆధారాలను చాటుమాటుగా సవరించుకుంటూ పోతున్నారన్నారు.ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు కేంద్రం చుట్టూ తిరుగుతూ నిధులు రాబడి కోసం చేస్తున్న ప్రయత్నాలన్నీ పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు.ఆర్థిక మాన్యాన్ని అభివృద్ధి పరచడంలో విఫలమవుతున్న ప్రభుత్వాలు ప్రభుత్వ వ్యవస్థలనైన బలోపేతం చేయలేకపోతున్నారని తెలుగు ప్రజలు తీవ్రమైన విమర్శలు చేస్తున్నారన్నారు.వ్యాపారాలే ప్రధాన లక్ష్యంగా పోటీపడుతున్న నాయకులను చూస్తుంటే ప్రభుత్వం ఉంటున్న ఐదు సంవత్సరాల కాలంలో ఆకాశమంత ఎత్తుకు ఎదగాలనే తపన తహతహలాడుతున్నట్టుగా కనిపిస్తుందన్నారు.ప్రజా వేదికల మీద అభివృద్ధి పనులపై ఎంత చక్కగా అబద్ధాలు ఆడుతున్నారో నాయకుల మాటలను బట్టి చూస్తే స్పష్టంగా తేలిపోతుందన్నారు. పేదల బతుకుల సంగతేందంటూ ప్రభుత్వాలు నిలదీశారు.ప్రజలను అభివృద్ధి చేయడానికి అప్పులు చేస్తున్నారా ప్రజలను అప్పులపాలు చేయడానికి అప్పులు చేస్తున్నారా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎటు తేల్చుకోలేకపోతున్నాయన్నారు.మొత్తం మీద ప్రజలను అప్పుల పాలు చేయడానికి పెద్ద ఎత్తున అప్పులు చేస్తున్నారని ఇరు రాష్ట్రాల దయనీయమైన స్థితులను చూస్తుంటే పూర్తిగా అర్థమవుతుందన్నారు.అణచివేత ధోరణలో ఆగమగుతున్న ప్రజలను ప్రభుత్వాలు అనుకున్న స్థాయిలో ఆదుకోలేకపోతున్నాయి అన్నారు.ప్రభుత్వ శాఖలలోని పైసలన్నీ ఎటు పోతున్నాయో ఎవరికీ అంతుచికడం లేదన్నారు. పైగా ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగిస్తున్న రికార్డుల ఆధారాలను ఎప్పటికప్పుడు మాయం చేసుకుంటూ లెక్కలు సంబంధించిన ఆధారాలు లేకుండా చేస్తున్నారన్నారు.భూములు వేలం వేస్తున్నప్పటికిని వేలం రూపంలో ప్రభుత్వాలకు వస్తున్న ఆర్థిక ఆదాయాన్ని బట్టి సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలుపరచలేకపోతుండడం ప్రభుత్వాల అసమర్థత పాలనలకు గుర్తింపుగా మారుతున్నాయన్నారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నిధులు నిధులు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రం పూర్తిగా వెనుకబడి పోతుందని దానివల్ల రాష్ట్రంలో స్థాయికి మించిన అప్పులు చేయవలసిన పరిస్థితి ఎదురవుతుందన్నారు.

**అప్పులు- తిప్పలు**

రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులను చేస్తూ అధిక సంతోషాన్ని అనుభవిస్తున్న ప్రతి సందర్భంలో సాధారణమైన ప్రజలే తిప్పలు పడాల్సిన దుస్థితిల ఎదురవుతాయి అన్న సంగతిని మర్చిపోతున్నారు.అప్పులు చేయడంలో ఎక్కడ వెనుకాడ లేకపోతున్న ప్రభుత్వాలు ప్రజలను తిప్పలు పెట్టడంలో కూడా ఎక్కడ వెనకాడ లేకుండా పోతున్నారన్నారు.ఎన్నికల అప్పుడు మాత్రమే ఉపయోగంలోనికి వస్తున్న సంక్షేమాల వల్ల రాష్ట్రంలోని పేద ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేనప్పటికిని సంక్షేమాల పేర్లు చెప్పి మాత్రమే ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయన్న సంగతి వాస్తవమన్నారు.పెరిగిపోతున్న అప్పుల వల్ల పేరుకుపోయిన సమస్యలన్నీ తీర్చబడతాయేమోనని ఎంతగానో ఆశ పడుతున్న ప్రజలకు అప్పుల బాధలన్నీ తిప్పలుగా మారి కొత్త తండాలను తెచ్చిపెడుతున్నాయన్నారు.అప్పులు చేస్తున్న ప్రతిసారి అదే స్థాయిలో ప్రజాసేవ అభివృద్ధి చేయబడగలిగితే ప్రజలపై పడుతున్న అప్పుల భారాన్ని తిప్పల భారంగా మారిన ప్రజలు పెద్దగా పట్టించుకునే వారు కాదన్నారు.ప్రస్తుతం అప్పులు పెరుగుతూ ఉన్నందున ప్రజలకు తిప్పలవుతున్నాయని తీవ్రస్థాయిలో ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు.నాయకుల ఖర్చు ప్రభుత్వాలు భరిస్తున్నంత కాలం ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు ప్రజల సొమ్మును ప్రభుత్వ రూపంలో దుబారాగా ఖర్చు చేస్తూ లక్షల కోట్ల రూపాయల అప్పులను రాష్ట్ర ప్రజలపై తిప్పలుగా మలుస్తున్నారన్నారు.ప్రజలను ఆదుకోండి ప్రజలపై అప్పుల భారాన్ని తొలగించండి అంటూ ప్రభుత్వాలను కోరారు.

## ముచ్చర్ల ప్రాథమిక పాఠశాల పర్యవేక్షణ

**విద్యా నాణ్యతపై నోడల్ ఆఫీసర్ బృందం సమీక్ష**



**హాసన్ పర్తి, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లా పర్యవేక్షణ కార్యక్రమంలో భాగంగా హాసనపర్తి మండలం ముచ్చర్ల ప్రాథమిక పాఠశాలను నోడల్ ఆఫీసర్ బృందం పర్యవేక్షించింది. పి.ఎస్. డీఐటీ టీమ్--2 కు చెందిన నోడల్ ఆఫీసర్ ఎల్. నరేందర్ నాయక్, సభ్యులు బి. శివప్రసాద్, చ. శ్రీనివాస్ పాఠశాలను సందర్శించి విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్యామల, అనిత, మమతలతో సమావేశమై విద్యా సంబంధిత పలు రిజిస్టర్లు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టిఎల్ఎం) సామాగ్రిని పరిశీలించారు. విద్యార్థుల గుణాత్మక ప్రగతికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని బృందం సమీక్షించింది. తరగతి గదిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. పాఠశాల ఆట స్థలం విశాలంగా ఉండటం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందేందుకు మంచి అవకాశమని పేర్కొన్నారు. ఆ సదుపాయాలను మరింత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా టీచర్ హ్యాండ్‌బుక్, టెక్స్ట్ బుక్స్, వర్క్‌బుక్స్ మధ్య సరైన అనుసంధానం (అలైన్‌మెంట్) ఉండేలా చూడాలని బృంద సభ్యులు ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల నేర్పు స్థాయిని మరింత మెరుగుపరచేందుకు క్రమబద్ధమైన బోధన పద్ధతులను అనుసరించాలని తెలిపారు.

## గోదావరి జలాలతో తాండూరు.. పరిగి.. వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తాం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**వికారాబాద్ జిల్లా, నారాయణపూర్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

గోదావరి జలాలను వినియోగించి తాండూరు, పరిగి, వికారాబాద్ ప్రాంతాలను సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే వచ్చే మూడేళ్లలో మక్తల్--నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. "ప్రజా పాలన -- ప్రగతి బాట" కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా నారాయణపూర్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులు త్వరలో ప్రారంభించి, సంబంధిత ప్రణాళికలను వేగవంతం చేస్తామని ప్రకటించారు. తాండూరు పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను పూర్తి చేయడంతో పాటు కాగ్నా నది నుంచి మంచినీటి సరఫరా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. అదేవిధంగా సంవత్సరం లోపే అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ మీదుగా తాండూరు వరకు రహదారి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలకమైన రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్ల పనులను పూర్తి చేసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వికారాబాద్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వెల్లడించారు. అనేక సమస్యలను అధిగమిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణలో రైతులు, నిరుద్యోగ యువత, మహిళలకు ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లాలోని 6,650 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకం కింద రూ.567.69 కోట్ల చెక్కును మహిళా ప్రతినిధులకు ముఖ్యమంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఆ ఉద్యోగులకు పోలీస్ శాలరీ ప్యాకేజీ

**ఎస్బీఐతో ప్రభుత్వ ఒప్పందం**

**టీజీఎస్పీఎఫ్ సిబ్బందికి పోలీసు శాలరీ ప్యాకేజీ అమలుకు ప్రభుత్వం నిర్ణయం**

**ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి కోటి రూపాయల బీమా సౌకర్యం**

**సిబ్బంది పిల్లల చదువులు, కుమార్తెల వివాహాలకు ఆర్థిక సాయం**

**పలు రుణ, బ్యాంకింగ్ ప్రయోజనాలు కూడా వర్తింపు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సిబ్బందికి సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని వివిధ సంస్థలకు భద్రత కల్పిస్తున్న తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (టీజీఎస్పీఎఫ్) సిబ్బందికి కూడా పోలీసు శాలరీ ప్యాకేజీని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. సికింద్రాబాద్ రాణిగంజ్‌లోని బుద్ధ భవన్‌లో శనివారం టీజీఎస్పీఎఫ్, ఎస్బీఐ మధ్య ఈ మేరకు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం టీజీఎస్పీఎఫ్ సిబ్బంది ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ. కోటి అందుతుంది. అదే విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. కోటీ 60 లక్షలు చెల్లిస్తారు. విధి నిర్వహణలో శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ. 80 లక్షల వరకు పరిహారం అందిస్తారు. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది పిల్లల ఉన్నత విద్య కోసం రూ. 28 లక్షల వరకు, ఇద్దరు కుమార్తెల వివాహాల కోసం రూ. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తారు. వీటితో పాటు రూ. 10 లక్షల గ్రూప్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా ఉంటుంది. కాలిన గాయాల కేసుల్లో ప్లాస్టిక్ సర్జరీకి గరిష్ఠంగా రూ. 10 లక్షలు, అంబులెన్స్ ఖర్చులకు రూ. 50 వేలు, ఎయిర్ అంబులెన్స్ కోసం రూ. 10 లక్షల వరకు చెల్లిస్తారు. ఈ ఒప్పందం ద్వారా సిబ్బందికి పలు రుణ సౌకర్యాలు, లాకర్ అద్దెపై రాయితీలు, ప్లాటినం రూపే డెబిట్ కార్డు వంటి అదనపు ప్రయోజనాలు కూడా లభించనున్నాయి.

## 'ఫోన్ ఇన్'... హైడ్రా కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు చెప్పిన ప్రజలు

**హైడ్రా కార్యాలయంలో తొలిసారి ఫోన్ ఇన్ కార్యక్రమం**

**రంగనాథ్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లిన 36 మంది**

**ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం ఓఆర్ఆర్ బయటకు విస్తరించాలని కోరిన ప్రజలు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైదరాబాద్ నగర ప్రజలు ఫోన్ చేసి సమస్యలను చెప్పుకున్నారు. హైడ్రా కార్యాలయంలో ఆయన తొలిసారి 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టగా, గంటలోనే 36 మంది ఫోన్ చేశారు. భూ ఆక్రమణలు, నీటి వనరులు కలుషితం కావడం వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ స్థలాలు, నీటి వనరుల పరిరక్షణ కోసం హైడ్రా పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు బయటకు కూడా విస్తరించాలని ప్రజలు కోరారు. తమ ప్రాంతాల్లోని చెరువులో మురుగు నీరు వచ్చి చేరుతోందని, దుర్గంధభరిత వాతావరణంతో ఇబ్బందులు పడుతున్నామని కొంతమంది కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుర్రపు డెక్కపెరిగి దోమలతో ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఇతర చెరువుల్లాగే తమ ప్రాంతంలోని చెరువులనుకూడా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రజావాణి ఉంటుంది. కానీ ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు కమిషనర్ 'ఫోన్ ఇన్' కార్యక్రమం చేపట్టారు. హైడ్రా కార్యాలయం వరకు రాలేనివారు సమస్యలను ఫోనులో చెప్పుకునే అవకాశం కల్పించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగగా, స్వయంగా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదుదారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారి వివరాలను వారికి అందజేశారు. వారం రోజుల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా తనకు ఫోను చేయాలని ఫిర్యాదుదారులకు సూచించారు. సెలవు రోజుల్లో మినహా ప్రతి శనివారం 040-29565750, 040-29565759 ఈ నంబర్లకు ఫోను చేసి సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాల నుంచి పలువురు ఫోన్లు చేసి తమ వద్ద కూడా చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని కోరారు. అయితే హైడ్రా పరిధి ఓఆర్ఆర్ వరకేనని రంగనాథ్ స్పష్టం చేశారు. మొదటి విడతలో 6 చెరువులను అభివృద్ధి చేశామని, త్వరలో మరో 14 చెరువులను అభివృద్ధి చేస్తామని అన్నారు.

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు**

**ప్రపంచవ్యాప్తంగా కుదిపేస్తున్న ఎప్‌స్టీన్ కుంభకోణంతో పోల్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ప్రమాదం అనుమానాలకు తావిస్తోందన్న బీఆర్ఎస్ నేత**

**ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని ట్వీట్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. ఓటుకు నోటు ఆధారాలను ధ్వంసం చేయడానికేనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. దీనిని రీట్వీట్ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు అత్యంత కీలకమైన, గట్టి భద్రత ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదం జరగడం పలు అనుమానాలకు తావిస్తోందని, అనేక సున్నితమైన కేసులకు సంబంధించిన ఆధారాలు(2015 నాటి ఓటుకు నోటు కేసుతో సహా ) ఇందులో భద్రపరచి ఉన్నాయని పేర్కొన్నారు. వాటి పరిస్థితి ఏమిటి? దీనిపై ఉన్నత స్థాయి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆధారాల నిర్మూలనకు ప్రస్తుత పాలకులు ఎంతకైనా తెగిస్తారని మండిపడ్డారు. అమెరికాలో ఎంతోమంది చిన్నారులను అపర కుబేరులకు అర్పించిన లైంగిక నేరస్తుడు ఎప్‌స్టీన్ జైలులో అనుమానాస్పదంగా చనిపోయాడని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కాగా, ఎప్‌స్టీన్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే.

## వరుస యాంత్రిక లోపాలు..

**ప్రయాణికుల ప్రాణాలతో ఆటలాడుతున్న హైర్ బస్సులు**

**ప్రయాణికుల ప్రాణాలు పణంగా?.. హైర్ బస్సు లోపాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ఒక ఆర్టీసీ హైర్ బస్సులో చోటుచేసుకున్న ప్రమాద పరిస్థితిని కండక్టర్ అప్రమత్తతతో తప్పించడంతో వందలాది మంది ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రయాణికులతో నిండిన బస్సు ప్రయాణిస్తున్న సమయంలో ముందు టైర్ వీల్ బోల్టులు విరిగిపోవడంతో ప్రమాద పరిస్థితి ఏర్పడగా, కండక్టర్ అప్రమత్తంగా గమనించి వెంటనే డ్రైవర్‌కు సమాచారం ఇవ్వడంతో బస్సును రహదారి పక్కన ఆపి పెను ప్రమాదాన్ని నివారించారు. ప్రయాణికుల సమాచారం ప్రకారం, బస్సు ప్రయాణిస్తున్న సమయంలో అసహజ శబ్దం వినిపించడంతో కండక్టర్ పరిస్థితిని గుర్తించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. బస్సును నిలిపి పరిశీలించగా ముందు టైర్ వీల్ బోల్టులు విరిగిపోయినట్లు గుర్తించారు. సమయానికి బస్సు నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కండక్టర్ అప్రమత్తతను ప్రయాణికులు ప్రశంసించారు. అయితే ఈ సంఘటనపై ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు సాంకేతిక తనిఖీలలో లోపాలు కారణంగానే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపిస్తున్నారు. జనవరి 21, 2026న జరిగిన ఈ ఘటనలో కండక్టర్ అప్రమత్తంగా వ్యవహరించకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని వారు పేర్కొన్నారు. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, అదే బస్సులో తిరిగి ఫిబ్రవరి 3, 2026న అంబాల గ్రామం వద్ద వెనుక టైర్ మరమ్మత్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుసగా యాంత్రిక లోపాలు తలెత్తడం పట్ల ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై, హైర్ బస్సు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన తనిఖీలు చేయకుండా బస్సులను రోడ్లపై నడపడం వల్ల ప్రయాణికుల ప్రాణాలు పణంగా పెట్టబడుతున్నాయని విమర్శిస్తున్నారు. ఈ ఘటనల నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు, రవాణా (ట్రాన్స్‌పోర్ట్) శాఖ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర దర్యాప్తు చేపట్టి, హైర్ బస్సు యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, మేధావి వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలను రోడ్లపై నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే జిల్లాలో నడుస్తున్న హైర్ బస్సులన్నింటినీ సాంకేతికంగా పూర్తిగా తనిఖీ చేసి,



జై భీమ్ 2026-01-23 https://epaper.jaibheemtv.com/

3 , 2026 జనరల్ న్యూస్

**కండక్టర్ అప్రమత్తత.. వందల ప్రాణాలకు రక్షణ**

టీజీ ఆర్టీసీ బస్సులో తృటిలో తప్పిన పెను ప్రమాదం

హీరోగా నిలిచిన కాందారి సుధాకర్

హన్మకొండ, 22 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రయాణికుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్**

**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. ఈరోజు హనుమకొండ సౌత్ మండల కమిటీ సమావేశం రామ్‌నగర్‌లోని సుందరయ్య భవన్ జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బొల్లారం సంపత్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాగుల రమేష్ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ముందుగా అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి యజమానులకు అనుకూలంగా, కార్మికులకు నష్టదాయకంగా చట్టాలను రూపొందించిందని ఆయన అన్నారు. అలాగే రైతు వ్యతిరేక చట్టాలు, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే 100 రోజుల పని చట్టాన్ని బలహీనపరిచి రాష్ట్రాలపై బాధ్యత మోపడం వల్ల రైతు కూలీలకు తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఉన్న తమ బలాన్ని ఉపయోగించుకుని ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయడానికి అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని రాగుల రమేష్ పిలుపునిచ్చారు. సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు మందసంపత్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం కులం, మతం, ప్రాంతం పేర్లతో ప్రజల మధ్య విభేదాలను పెంచుతూ దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలు సృష్టిస్తోందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ప్రజల సమస్యలను పక్కన పెట్టిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల, జిల్లా నాయకులు ఆలకుంట యాకయ్య, దూడపాక రాజేందర్, సమ్మయ్య, సప్పిడి మనోహర్, వంగాల రవీందర్, దాసరి నరేష్, ఏసు, వెంకన్న, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకై పకడ్బందీ ఏర్పాట్లు






**ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి: సీపీ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులకు సూచించారు. ఈ నెల 11వ తేదీన జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో శనివారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎన్నికల నిర్వహణకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, భద్రతా ఏర్పాట్లు, సున్నిత ప్రాంతాల గుర్తింపు, ఎన్నికల రోజు, కౌంటింగ్ రోజున చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా, నిల్వలను కట్టడి చేయాలని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే తాయిలాలు, డబ్బు పంపిణీ వంటి చర్యలపై కఠిన నిఘా పెట్టాలని ఆదేశించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసే లేదా ఎన్నికల శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాల పంపిణీ, పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు వంటి ప్రతి దశలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు ఎన్నికల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించేలా పోలీస్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పోలీస్ సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని సీపీ సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, కవిత, ఏఎస్పీలు శుభం, చేతన్, ట్రైనీ ఐపీఎస్ మనీషా నెహ్రూ, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# అకాడమిక్స్‌తో పాటు నైపుణ్యాలు, దృక్పథం అవసరం

**కేయూ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి**

**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**




అకాడమిక్స్‌లో ప్రతిభతో పాటు జ్ఞానం, నైపుణ్యం, సరైన దృక్పథం ఉంటేనే ప్రాంగణ నియామకాలలో విద్యార్థులు విజయాన్ని సాధించగలరని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన "మెగా జాబ్ మేళా" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాబ్ మేళాను ప్రారంభించారు. కార్యక్రమానికి ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ, అకాడమిక్‌గా ముందుండటం ఒక మెట్టు అయితే, నైపుణ్యాలు మరియు ప్రవర్తనా సామర్థ్యం మరో ముఖ్యమైన మెట్టని తెలిపారు. అంకితభావం, నిబద్ధత కలిగిన వ్యక్తి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని అన్నారు. ప్రముఖ సంస్థలైన సి.ఐ.ఎస్. టెక్నాలజీస్, పేటియం, గీకే, మేజిక్ బస్ సంస్థలు సుమారు 400 మంది విద్యార్థులకు ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గెలుపు--ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని మెగా జాబ్ మేళాలు నిర్వహించేందుకు సంస్థలు సహకరించాలని కోరారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల మాట్లాడుతూ, విద్యార్థులు ఉద్యోగయోగ్యులుగా తయారవ్వడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ, ప్రస్తుత జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యంత అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లు డా. ఎన్. రమణ, డా. కే. భిక్షాలు, సి.ఐ.ఎస్. టెక్నాలజీస్ ప్రతినిధి కిరణ్, పేటియం ప్రతినిధి ప్రేమ్‌కుమార్, గీకే ప్రతినిధి సందీప్‌కుమార్, మేజిక్ బస్ ప్రతినిధి రాకేష్, ప్లేస్‌మెంట్ అధికారులు డా. సంతోష్, బొల్లం కిరణ్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వరకు వివిధ రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డా. చిర్ర రాజు తెలిపారు.

# పారా త్రో బాల్ పోటీల్లో కే.యూ విద్యార్థుల ప్రతిభ

**విజేతలను అభినందించిన వైస్ ఛాన్సలర్**



**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఉన్న సింగానియా యూనివర్సిటీలో ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పారా త్రో బాల్ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి అభినందించారు. ఈ పోటీల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి ఎం. రాజేందర్ రజత పథకం సాధించగా, ఎం.హెచ్.ఆర్.ఎం పరిశోధక విద్యార్థిని డి. రమాదేవి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని ఎం. కృష్ణవేణి కాంస్య పథకాలు సాధించి విశ్వవిద్యాలయానికి కీర్తి తీసుకొచ్చారు. విజేతలను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, డిఫరెంట్లీ ఏబుల్డ్ విభాగ సంచాలకులు డా. ఎ. రాజు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలు ఇతరులకు ప్రేరణగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం తరపున క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని అధికారులు తెలిపారు.

# పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ కార్యక్రమం




**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 2026--27 సంవత్సర కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డా. పి. పద్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి డా. తిరునహరి శేషు హాజరై 2026--27 కేంద్ర బడ్జెట్‌పై విస్తృతంగా ప్రసంగించారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, వనరుల సమర్థ వినియోగం, అభివృద్ధి ప్రాధాన్యతలు వంటి అంశాలను విశ్లేషణాత్మకంగా వివరించారు. బడ్జెట్‌లోని ముఖ్య అంశాలు, సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యత అవసరాన్ని విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ ఆదాయపన్ను పరిధిలోకి వచ్చే ప్రతి పౌరుడు సమయానికి పన్నులు చెల్లించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. విద్యార్థులు ఆర్థిక వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. తదనంతరం జరిగిన చర్చా కార్యక్రమంలో డా. పి. పద్మ, ముఖ్య వక్త డా. టి. శేషు కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ చర్చ విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా. సురేశ్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, అధ్యాపకులు డా. సామ్యూల్ ప్రవీణ్ కుమార్, పీడీ సుజాత, మధు, డా. కె. శ్రీనివాస్, డా. రామకృష్ణారెడ్డి, రత్నమాల, రేణుక, డా. సారంగపాణి, రమేష్ కుమార్, రామ్ రెడ్డి, మాధవి, శ్రీనివాస్ రెడ్డి తదితర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# మెగా జాబ్ మేళాలో 280 మంది విద్యార్థులకు ప్రాంగణ నియామక పత్రాలు



**హన్మకొండ, ఫిబ్రవరి 7 (జై భీమ్ న్యూస్)**

మెగా జాబ్ మేళా కార్యక్రమంలో భాగంగా మొత్తం 280 మంది విద్యార్థులు ప్రాంగణ నియామక పత్రాలు అందుకున్నారు. ఈ నియామక పత్రాలను కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్లేస్‌మెంట్ వివరాల ప్రకారం సి.ఐ.ఎస్. టెక్నాలజీ సంస్థలో 162 మంది, ఎస్.ఎం. కన్స్ట్రక్షన్‌లో 15 మంది, జీకేలో 82 మంది, పేటియం సంస్థలో 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు ప్రారంభ వేతనం రూ.1.80 లక్షల నుంచి రూ.3.00 లక్షల వరకు ఉంటుందని, పని ప్రదేశం హైదరాబాద్‌గా నిర్ణయించబడిందని ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ చిర్రా రాజు తెలిపారు. ఉద్యోగంలో చేరిన తరువాత మూడు నెలల పనితీరు ఆధారంగా వేతన పెంపు కూడా కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. మెగా జాబ్ మేళా ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని తెలిపారు.

# జాతీయ స్థాయి అర్హత పరీక్షలో మెరిసిన విద్యార్థులు

అభినందించిన కేయూ వైస్ ఛాన్సలర్



**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

డిసెంబర్--జనవరి నెలల్లో నిర్వహించిన జాతీయ స్థాయి అర్హత పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులను కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజేందర్ కట్ల అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్షల్లో విజయం సాధించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని, విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ అర్హత పరీక్షలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నుంచి 7 మంది, ఫార్మసీ నుంచి 1 మంది, ఎకనామిక్స్ నుంచి 1 మంది, సోషియాలజీ నుంచి 6 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగ అధిపతి ఆచార్య బి. సురేష్ లాల్, సోషియాలజీ విభాగ అధిపతి డాక్టర్ ఎం. స్వర్ణలత, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య జే. కృష్ణ వేణి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, ఇతర అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు వైస్ ఛాన్సలర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# రోజు మేడారం హుండీ లెక్కింపు

రూ.2 కోట్లకు పైగా ఆదాయం

మూడు రోజుల్లో రూ.8 కోట్లకు పైగా ఆదాయం నమోదు



**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర అనంతరం హుండీల లెక్కింపు ప్రక్రియ హనుమకొండలోని టిటిడి కళ్యాణ మండపంలో కొనసాగుతోంది. ఎండోమెంట్స్ శాఖ అధికారులు, సేవా సమితి సిబ్బంది, పర్యవేక్షణాధికారుల సమక్షంలో లెక్కింపు ప్రక్రియను పద్ధతిగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు జరిగిన లెక్కింపులో 140 హుండీలను తెరిచి లెక్కించగా సుమారు రూ.2 కోట్ల 1 లక్ష 90 వేలకుపైగా నగదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నగదుతో పాటు కొంత విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు వెల్లడించారు. బంగారం, వెండి ఆభరణాలను వేర్వేరుగా సేకరించి భద్రపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు మూడు రోజులలో మొత్తం 425 హుండీలను లెక్కించగా, రూ.8 కోట్ల 6 లక్షలకు పైగా ఆదాయం నమోదైనట్లు అధికారిక వివరాలు తెలియజేస్తున్నాయి. లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని, నిబంధనలకు అనుగుణంగా ప్రతి దశను నమోదు చేస్తూ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే లెక్కించిన నగదును బ్యాంకు అధికారులకు అప్పగించే ప్రక్రియ కూడా పర్యవేక్షణాధికారుల సమక్షంలో జరుగుతోందని తెలిపారు. నాణేల లెక్కింపు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, తదుపరి రోజుల్లో దానిని చేపట్టనున్నట్లు సమాచారం. మేడారం జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరై సమర్పించిన కానుకల వల్ల ఈసారి కూడా గణనీయమైన ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి





జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

రానున్న వేసవి కాలంలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి వేసవిలో తాగునీటి సరఫరాకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గాయత్రి, ఈఈ రామాంజనేయులు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్‌లతో కలిసి యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై చర్చించారు. గత సంవత్సరంలో తాగునీటి సమస్యలు ఎదురైన గ్రామాలు, తీసుకున్న పునరుద్ధరణ చర్యలు, జిల్లాకు అవసరమైన నీటి సామర్థ్యం, నీటి వనరుల ప్రస్తుత స్థితిగతులపై అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర నివేదికను మిషన్ భగీరథ ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారి త్వరితగతిన అందజేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు ప్రతి ఇంటికి తాగునీరు అందుతున్నదా లేదా అన్నది క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడకగదుల ఇళ్లు, వలస కార్మికులు నివసిస్తున్న కాలనీలు సహా అన్ని నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని ఎంపీడీవోలు, ఎంపీవోలకు సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఏ చిన్న సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, డిఆర్డీవో మేన శ్రీను, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ డిఈలు, ఏఈలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యూరియా ఎరువుల బుకింగ్‌కు యాప్ తప్పనిసరి

ఫిబ్రవరి 8 నుంచి ప్రారంభం -- ములుగు జిల్లా వ్యవసాయ శాఖ సూచనలు

**ములుగు, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ములుగు జిల్లా పరిధిలోని రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ కీలక సూచనలు జారీ చేసింది. జిల్లాలో యూరియా ఎరువుల సరఫరాను సక్రమంగా నిర్వహించేందుకు, పారదర్శకతను పెంచేందుకు ఫిబ్రవరి 8, 2026 నుండి యూరియా ఎరువుల బుకింగ్ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని రైతులందరూ తప్పనిసరిగా గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న సంబంధిత ఫర్టిలైజర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, యాప్ ద్వారానే యూరియా ఎరువులను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యాప్‌లో రైతులు తమ పంట వివరాలు, సాగు విస్తీర్ణం, అవసరమైన తేదీ వంటి సమాచారాన్ని నమోదు చేయడం ద్వారా, వారికి అవసరమైన యూరియా బస్తాల సంఖ్యను యాప్ స్వయంగా సూచిస్తుందని తెలిపారు. అలాగే రైతులు తమకు సమీపంలోని ఎరువుల డీలర్ దుకాణాన్ని ఎంపిక చేసుకుని, అనుకూలమైన తేదీకి బుకింగ్ చేసుకోవచ్చని, బుకింగ్ పూర్తయిన తరువాత సూచించిన తేదీన ఎరువులను పొందవచ్చని వ్యవసాయ అధికారులు వివరించారు. ఈ విధానం ద్వారా ఎరువుల పంపిణీ ప్రక్రియ సులభతరం అవుతుందని, రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యాప్ డౌన్‌లోడ్ చేయడంలో గానీ, బుకింగ్ ప్రక్రియలో గానీ నెట్‌వర్క్ లేదా యాప్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు ఎదురైతే, రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా మండల వ్యవసాయ అధికారి (ఎంఎఓ)లను సంప్రదించాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు ములుగు -- 8977751161, వెంకటాపూర్ -- 8977751162, మల్లంపల్లి -- 8712499938, ఏటూరు నాగారం -- 8977751142, గోవిందరావుపేట -- 8977751149, మంగపేట -- 8977751151, కన్నాయిగూడెం -- 8977751150, తాడ్వాయి -- 8977751152, వెంకటాపురము -- 8977751153, వాజేడు -- 8977751152. కావున ములుగు జిల్లా రైతులందరూ యూరియా ఎరువుల బుకింగ్‌ను నిర్దిష్ట సమయానికి పూర్తి చేసుకుని, అవసరమైన ఎరువులను పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ కోరింది. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పంటల సాగుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.



# వర్ధన్నపేటలో కాంగ్రెస్ ప్రచార జోరు

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఘనస్వాగతం పలికిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**వర్ధన్నపేట, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఈరోజు వర్ధన్నపేట మున్సిపాలిటీని సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి పాల్గొని పార్టీ శ్రేణులకు, స్థానిక ప్రజలకు ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు, కుడా చైర్మన్ మరియు వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రికి స్వాగతం పలుకుతూ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. సమావేశంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై నేతలు పరస్పరం చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా, గృహ నిర్మాణం వంటి రంగాల్లో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. త్వరలోనే పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తించి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తున్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం చివర్లో నాయకులు ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.



# పాఠ్య ప్రణాళికలో విస్తృత మార్పులకు శ్రీకారం చుట్టాలి

**కేయూ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి**

**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధనల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా పాఠ్య ప్రణాళికలో విస్తృతమైన, సమకాలీన మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని సైన్స్ విభాగాల అధిపతులు, పాఠ్య ప్రణాళిక కమిటీ అధ్యక్షులు, సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి. హనుమంతు సమక్షంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేలా, సమాజ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు తీసుకురావాలని సూచించారు. 2026–27 విద్యా సంవత్సరం నుంచే ఈ మార్పులు అమలులోకి వచ్చే విధంగా ఒక నెల వ్యవధిలో పాఠ్య ప్రణాళికను పునఃసిద్ధం చేయాలని ఆయా విభాగాలను ఆదేశించారు. ప్రతి సబ్జెక్టుకు అనుగుణంగా భారతీయ జ్ఞాన వ్యవస్థ (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్)కు సంబంధించిన అంశాలను పాఠ్య ప్రణాళికలో తప్పనిసరిగా చేర్చాలని సూచించారు. భారతదేశానికి చెందిన సంప్రదాయ విజ్ఞానం, శాస్త్రీయ ఆలోచనలు, పరిశోధనా విధానాలపై విద్యార్థులకు అవగాహన కలిగేలా ఈ అంశాలు ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేలా విలువాధారిత అదనపు కోర్సులు (వాల్యూ అడిషన్ కోర్సులు) ప్రతి విభాగంలో తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సిలబస్ రూపకల్పనలో పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, పరిశ్రమలు, ఇతర సంబంధిత వర్గాల అభిప్రాయాలు, సూచనలు కూడా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృత్రిమ మేధస్సు, క్వాంటం సాంకేతికతల వంటి ఆధునిక, భవిష్యత్ ప్రాధాన్యత కలిగిన అంశాలను పాఠ్య ప్రణాళికలో పొందుపరచాలని ఆచార్య ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో పోటీ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రతి కోర్సుకు సంబంధించి కోర్సు అవుట్‌కమ్‌లు, ప్రోగ్రాం అవుట్‌కమ్‌లు, ప్రోగ్రాం స్పెసిఫిక్ అవుట్‌కమ్‌లను స్పష్టంగా పాఠ్య ప్రణాళికలో పొందుపరచాలని అధ్యయన మండలి సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా కోర్సుల రూపకల్పనలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశోధన దృక్పథం, ఉద్యోగావకాశాలు, సమకాలీన సమాజ సమస్యలకు పరిష్కారాలు సూచించే అంశాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠ్య ప్రణాళిక విద్యార్థులను ఉద్యోగోన్ముఖులుగా, పరిశోధనాభిలాషులుగా తీర్చిదిద్దేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సైన్స్ విభాగాల విభాగాధిపతులు, పాఠ్య ప్రణాళిక కమిటీ అధ్యక్షులు, సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి. హనుమంతు, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, ఐక్యూఏసి డైరెక్టర్ ఆచార్య ఎస్. నరసింహచారి, ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఆచార్య మామిడాల ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేటలో మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాల విడుదల



**నర్సంపేట, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) నర్సంపేటలో డిసెంబర్ 2025లో నిర్వహించిన బి.ఏ, బి.కామ్, బి.ఎస్.సి (లైఫ్ సైన్సెస్), బి.ఎస్.సి (ఫిజికల్ సైన్సెస్) మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ రాజేందర్ కట్ల విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి ఎస్. కమలాకర్‌ను అటానమస్ సెమిస్టర్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించినందుకు వైస్‌చాన్సలర్ అభినందించారు. ఫలితాల వివరాలను వెల్లడించిన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ, బి.ఎస్.సి కోర్సుల్లో 66.01 శాతం, బి.ఏలో 60 శాతం, బి.కామ్‌లో 75.79 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. మొత్తం మీద 67.5 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఫలితాలను క్యూఆర్ కోడ్, లింక్ ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలకు సహకారం అందించిన కళాశాల విద్యా కమిషనర్ ఎ. శ్రీదేవసేన, ఐఏఎస్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. బాలభాస్కర్, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ వి. రాజేంద్ర ప్రసాద్‌లకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్‌తో పాటు యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి ఎస్. కమలాకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డా. రాజీరు, డా. భద్రు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# హుండీల్లో వినూత్న కోరికలు

**సమ్మక్క-సారలమ్మకు భక్తుల మనోవేదనలు**
**మేడారం జాతరలో భక్తి, నమ్మకం ప్రతిబింబం**




**మేడారం, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సందర్భంగా హుండీల్లో భక్తులు సమర్పిస్తున్న కానుకలతో పాటు తమ వ్యక్తిగత కోరికలను కూడా వినూత్నంగా వ్యక్తం చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. జాతర అనంతరం హుండీల లెక్కింపు ప్రక్రియలో అధికారులు, సిబ్బంది అనేక ఆసక్తికర విషయాలను గమనిస్తున్నారు. ఇటీవల హుండీ లెక్కింపు సమయంలో వంద రూపాయల నోటుపై ఒక భక్తురాలు చేతిరాతలో "సమ్మక్క, సారలమ్మ నా కొడుకు బాధ నుంచి నన్ను కాపాడండి" అని రాసి సమర్పించిన నోటు కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది. కుటుంబ సమస్యతో బాధపడుతున్న ఒక తల్లి తన మనోవేదనను దేవతల ముందు ఇలా వ్యక్తం చేసిందని భావిస్తున్నారు. ఈ నోటును చూసిన సిబ్బంది, అక్కడున్న ఇతరులు కూడా భక్తి భావానికి ఇది ఉదాహరణగా వ్యాఖ్యానించారు. అదేవిధంగా మరికొందరు భక్తులు తెల్ల కాగితాలపై తమ కోరికలను రాసి హుండీల్లో వేస్తున్నట్లు లెక్కింపు సిబ్బంది తెలిపారు. పెళ్లి కావాలని, సంతానం కలగాలని, ఉద్యోగం రావాలని, అనారోగ్యం తగ్గాలని, అప్పులు తీరాలని ఇలా అనేక కోరికలను భక్తులు వనదేవతల ముందు ఉంచుతున్నారని చెప్పారు. మేడారం జాతరలో సమ్మక్క-సారలమ్మలను కోట్లాది మంది భక్తులు విశ్వాసంతో పూజిస్తారు. తమ కష్టాలను, బాధలను దేవతల ముందు వ్యక్తం చేస్తే పరిష్కారం లభిస్తుందనే నమ్మకం గిరిజనులతో పాటు ఇతర ప్రాంతాల భక్తుల్లో కూడా బలంగా ఉంది. అందువల్లే కొందరు భక్తులు సాధారణ కానుకలతో పాటు తమ కోరికలను రాతపూర్వకంగా సమర్పించడం ఆనవాయితీగా మారింది. హుండీ లెక్కింపు ప్రక్రియలో ఇలాంటి నోట్లు, కోరికల చిట్టీలు తరచూ బయటపడుతున్నాయని అధికారులు తెలిపారు. ఇది భక్తుల విశ్వాసం ఎంత గాఢంగా ఉందో తెలియజేస్తుందని వారు పేర్కొన్నారు. భక్తి, నమ్మకం, ఆశలు, మనోవేదనలు అన్నీ కలిసిన ఈ సంఘటనలు మేడారం మహాజాతర ప్రత్యేకతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి.

# లేబర్ కోడ్‌లతో కార్మికులకు నష్టం

**ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి**
**ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెకు మద్దతుగా 9న రౌండ్ టేబుల్ సమావేశం**




**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, దీనికి మద్దతుగా ఫిబ్రవరి 9న ఉదయం 11 గంటలకు రాంనగర్‌లోని కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో సామాజిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని సామాజిక సంఘాల ప్రతినిధులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు జరిగిన కెవిపిఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మంద సంపత్ మాట్లాడుతూ, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కోట్లాది కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించిందని విమర్శించారు. సమ్మె హక్కు, సంఘం ఏర్పాటు స్వేచ్ఛ, కనీస వేతనం వంటి హక్కులు ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్మిక వర్గాన్ని బలహీనపరిచే విధానాలు అమలు చేస్తున్నారని, పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేలా చట్టాలు రూపొందిస్తున్నారని ఆయన ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం దళితులు, గిరిజనులు, పేదలకు ఎంతో ఉపయోగపడుతోందని, కరువు, వలసలు, కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం క్రమేపి బడ్జెట్ తగ్గిస్తూ ఈ పథకాన్ని బలహీనపరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 90 శాతం నిధులు ఇచ్చిన కేంద్రం వాటాను తగ్గించి రాష్ట్రాలపై భారాన్ని మోపుతోందని, దీనివల్ల పథకం అమలులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. విత్తనాల ఉత్పత్తి రాష్ట్రాల పరిధిలో ఉండగా కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలు రైతులకు నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో సామాజిక శక్తులు భాగస్వాములు కావాలని, ముందుగా నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య, మాజీ అధ్యక్షులు జన్ను సాంబయ్య, నాయకులు ఇస్లావత్ రవీందర్, రేనుకుంట్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరులో భారీ బైక్ ర్యాలీ

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్‌పై ఘాటు విమర్శలు**

**తొర్రూర్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**




మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మున్సిపాలిటీలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు రెండు వేల బైకులతో జరిగిన ఈ ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. గులాబీ జెండాలతో పట్టణం మారుమోగగా, యువత కేరింతల మధ్య ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా దయాకర్‌రావు స్వయంగా బైక్‌పై జెండా పట్టుకుని పాల్గొనడం ఆకర్షణగా నిలిచింది. ర్యాలీ అనంతరం జరిగిన సభలో మాట్లాడిన ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ పేరు ఎత్తే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లిన వ్యక్తే ఇప్పుడు ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఉద్యమ సమయంలో రాజీనామా చేయకుండా దాక్కున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. ఇందిరమ్మ చీరల పేరుతో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. తొర్రూరులో 280 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇళ్ల కోసం పోరాడిన పేదలపై అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతు భరోసా, బోనస్ వంటి అంశాల్లో రైతులను నిరాశపరిచారని, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, పెన్షన్ల పెంపు వంటి హామీలు అమలు కాలేదని విమర్శించారు. విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు బంగారం వంటి హామీలు కూడా గాలికొదిలేశారని అన్నారు. కేసీఆర్ హయాంలో అభివృద్ధి జరిగిందనే విశ్వాసం ప్రజల్లో ఉందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తొర్రూర్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులు

**ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభం**
**అర్హులైన జర్నలిస్టులు అవకాశం వినియోగించుకోవాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



సమాచార మరియు పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026--28 సంవత్సరాల కాలానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనున్నందున, అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జర్నలిస్టులు తమ అక్రిడిటేషన్ పునరుద్ధరణ లేదా కొత్తగా పొందేందుకు నిర్దేశిత విధానాలను అనుసరించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం ముందుగా మీడియా సంస్థల యాజమాన్యాలు తమ సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పేర్ల జాబితాను ఒరిజినల్ రూపంలో జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు మాత్రమే సమాచార మరియు పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్‌సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 9వ తేదీ నుండి ప్రారంభమవుతుందని, అవసరమైన పత్రాలు, అర్హతలు, మార్గదర్శకాలను పరిశీలించి సమయానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ అక్రిడిటేషన్ కార్డులను పొందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆ ప్రకటనలో కోరారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల పర్యటన

**వ్యాక్సినేషన్ 100శాతం పూర్తి చేయాలి: డీఎంహెచ్ఓ డా. బి. సాంబశివరావు**

**వరంగల్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు నేడు సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాట్రపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ఆశాల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, పుట్టిన శిశువుల నుండి 16 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న బాలబాలికలకు, అలాగే గర్భిణీ స్త్రీలకు ఇవ్వాల్సిన వ్యాక్సినేషన్లు ప్రభుత్వ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సమయానుకూలంగా నిర్వహించి 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ప్రజలకు అందించాల్సిన వైద్య సేవలపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన పరీక్షలు మరియు చికిత్సలు అందించాలని సూచించారు. అలాగే 15 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు క్యాన్సర్ నివారణ కోసం ఇవ్వాల్సిన వ్యాక్సినేషన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి అందు బాటులోకి తేవాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి హెపటైటిస్--బి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని సంప్రదించి తగిన చికిత్సలు పొందాలని ఆయన సూచించారు. ఆశా కార్యకర్తల నుండి వైద్యాధికారుల వరకు ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, నిర్లక్ష్యం చేసినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వైద్యాధికారులు, సీసీ నాగరాజు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ఈ నెల 9, 10 తేదీలలో ములుగు జిల్లాలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడలు

**ములుగు, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్ - 2025-26 (2వ ఎడిషన్) జిల్లా స్థాయి క్రీడా పోటీలు ములుగు జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీరామ్ మోహన్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఫిబ్రవరి 9 మరియు 10 తేదీలలో ములుగు జిల్లా జాకారంలోని టీ.జీ.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎస్ / జూనియర్ కాలేజీ (సోషల్ వెల్ఫేర్ స్కూల్ (గ్రౌండ్) లో నిర్వహించబడనున్నాయి.

**ఫిబ్రవరి 9న జరిగే క్రీడలు:**

కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, జూడో, కిక్‌బాక్సింగ్, నెట్‌బాల్, స్విమ్మింగ్, చెస్, యోగా, బేస్‌బాల్, రెజ్లింగ్, వుషు, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ వంటి క్రీడా పోటీలు నిర్వహించబడతాయి.

**ఫిబ్రవరి 10న జరిగే క్రీడలు:**

ఖో-ఖో, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, క్యారమ్, సైక్లింగ్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, కరాటే, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్కేటింగ్, సాఫ్ట్ బాల్, జిమ్నాస్టిక్స్, తైక్వాండో, పారా గేమ్స్ మరియు రిక్రియేషనల్ గేమ్స్ నిర్వహించబడతాయి. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనే అన్ని క్రీడాకారులు, క్రీడాకారిణులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, సీఎం కప్ రిజిస్ట్రేషన్ అక్నాలెడ్జ్‌మెంట్ పత్రం వెంట తీసుకురావాలని అధికారులు సూచించారు. పత్రాల పరిశీలన అనంతరమే పోటీలలో పాల్గొనుటకు అనుమతి ఇవ్వబడుతుందని తెలిపారు. పోటీలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9676534013, 9550483619, 7330326241 నంబర్లను సంప్రదించాలని జిల్లా యువజన, క్రీడల శాఖ సూచించింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని క్రీడాకారులు, క్రీడాభిమానులు సహకరించాలని జిల్లా యువజన, క్రీడల శాఖ విజ్ఞప్తి చేసింది.

# జై భీమ్ నగర్‌లో కావేరి త్రాగు నీటి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావలి






**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక రాష్ట్ర బెంగళూరు నగరంలోనీ మహదేవపుర నియోజకవర్గంలోని బెలతూరు వార్డు సాదరమంగల, జై భీమ్ నగర ప్రాంతాలలో నీటి సరఫరా, డ్రైనేజీ, కొత్తగా యూజీడీ పనులకు మహదేవపుర ఎమ్మెల్యే మంజులా అరవింద లింబావళి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఎంతోకాలంగా ఈ ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది . ఎండాకాలం వస్తే చాలు నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేలా కావేరి నీటి సరఫరా పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాన్ని సాంకేతికంగా కావేరి త్రాగు నీటి బిందెను ప్రజలకు అందచేశారు. ఇదే రీతిన సాదరమంగలలో కావేరి నీటి సరఫరా పథకాన్ని ప్రారంభించారు. దీంతో ప్రజలకు శాశ్వత నీరు పరిష్కారం కానుందన్నారు. సందర్భంగా జై భీమ్ నగర్ లోని ప్రజలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా త్రాగునీటి సమస్య ఉండేది ఈరోజు ఎమ్మెల్యే ప్రారంభించిన కావేరి తాగునీటి పథకాన్ని ప్రారంభించడాన్ని ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ అధ్యక్షుడు హెచ్ఎస్ పిళ్ళప్ప, స్థానిక ప్రముఖులు రామాంజి, ప్రసాద్, రేవతి రాజ్ ( అమ్ము ) సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# భీమ్ నగర్‌లో ఘనంగా రమాబాయి జయంతి వేడుకలు

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**





డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కు రమాబాయి ఒక బలాన్నిచ్చింది. ఆమె మద్దతు వల్లే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించగలిగారు మరియు సమాన సమాజ నిర్మాణానికి పునాది వేయగలిగారు ఎస్ కె వెంకటేష్ అన్నారు. దళిత సంఘర్ష సమితి ( భీమ్ శక్తి ) మరియు మహాదేవపుర దళిత సంఘం నేతలు నిర్వహించిన రమాబాయి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్యాగమయి రమాబాయి అంబేద్కర్ 129వ జయంతి వేడుకలు సాధారమంగల మరియు జై భీమ్ నగర్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికం వల్ల కలిగే కష్టాలు మరియు నష్టాల గురించి రమాబాయికి తెలుసు. బాబాసాహెబ్ పోరాటానికి అది ఆటంకం కలిగించకుండా ఉండటానికి ఆమె తన బాధను మింగేసింది. అంబేద్కర్ విజయాల నుండి ఆమె ప్రేరణ పొందింది. అంబేద్కర్ తో రమాదేవి చేసిన కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు జరుపుకుంటున్నారు. దీనిని ప్రతి సంవత్సరం పండుగగా జరుపుకోవాలని ఆయన అన్నారు. రమాబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలకు ఎస్ కె వెంకటేష్ ప్రత్యేకంగా చీరలను అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్ష సమితి ( భీమ్ శక్తి ) రాష్ట్ర కార్యదర్శి ఎస్ కె వెంకటేష్, మహాదేవపుర దళిత సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ విక్రమ్, సమాజ సేవకుడు ఎస్ కె మదేష్ , అష్రఫ్ అలీ, షబానా తాజ్, రేవతి రాజ్, మంజుల, మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమదానంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి





## జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

పరిసరాల పరిశుభ్రత సమాజ ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమని, ప్రతి పౌరుడు శ్రమదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ పరిసరాలను శుభ్రంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువతి--యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పలు సామాజిక అంశాలపై చర్చలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ యువతతో కలిసి పబ్లిక్ గార్డెన్ పరిసరాలలో శ్రమదానంలో పాల్గొన్నారు. పార్కు ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. యువతతో కలిసి స్వయంగా శ్రమదానం చేయడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం అధికమవుతున్న నేపథ్యంలో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి కారణమవుతాయని, దీని ప్రభావం మన ఆరోగ్యంపై కూడా పడుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పదార్థాలను వినియోగించడం ద్వారా వరంగల్ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది అని, ప్రజల సహకారం లేకుండా స్వచ్ఛత కార్యక్రమాలు పూర్తి స్థాయిలో విజయవంతం కావని ఆమె అన్నారు. యువత సమాజంలో మార్పుకు దారితీసే శక్తిగా నిలవాలని, ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ కోఆర్డినేటర్ అన్వేష్, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, జీడబ్ల్యూఎంసీ అధికారులు, ఇతర శాఖల అధికారులు, వాలంటీర్లు, పెద్ద సంఖ్యలో యువతి--యువకులు పాల్గొని శ్రమదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సాంస్కృతిక సారథులు యువకులే - కేయూ ప్రొఫెసర్ స్వర్ణలత







**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జానపద సాహిత్యం, సాంస్కృతిక కళలను భవిష్యత్ తరాలకు అందించే వారధులు యువకులేనని కాకతీయ యూనివర్సిటీ సమాజ శాస్త్ర విభాగం ప్రొఫెసర్ స్వర్ణలత పేర్కొన్నారు. యువజన వ్యవహారాల శాఖ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ డిపార్ట్మెంట్ వరంగల్ నిర్వహిస్తున్న అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హనుమకొండ బాలసముద్రంలో ఉన్న యూత్ హాస్టల్‌లో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ యువజన సమ్మేళనం గత మూడు రోజులుగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాలలో సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు చెందిన జానపద, సాంప్రదాయ కళలను విద్యార్థులు ప్రదర్శించారు. కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన 37 మంది యువతి, యువకులు తమ ప్రాంతీయ కళారూపాలను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించగా, కిట్స్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తెలంగాణ జానపద కళలను ప్రదర్శించి ప్రేక్షకులను మెప్పించారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనలు రెండు రాష్ట్రాల సంస్కృతుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని, అందాన్ని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమానికి మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ అన్వే చింతల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ స్వర్ణలత మాట్లాడుతూ, ఇటువంటి అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనాల ద్వారా ఒక రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానం వంటి అంశాలు మరో రాష్ట్ర యువతకు సమగ్రంగా అవగాహన అవుతాయని తెలిపారు. ప్రతి రాష్ట్రం తన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకోవడంతో పాటు ఇతర రాష్ట్రాల సంస్కృతిని కూడా గౌరవించే భావన పెంపొందించుకోవాలని సూచించారు. దీనివల్ల జాతీయ సమైక్యత, సోదరభావం, భిన్నత్వంలో ఏకత్వం వంటి విలువలు యువతలో బలపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె. శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సతీష్ చంద్ర, మై భారత్ ఏపీఏ బానోత్ దేవిలాల్, మై భారత్ వాలంటీర్లు నవీన్ యాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం కేరళ బృందం వరంగల్ పరిసర ప్రాంతాల్లో పర్యటించింది. కొత్తవాడలోని జరీ వస్త్రాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఓరుగల్లు కోటను సందర్శించారు. అలాగే రంగసాయిపేటలోని వారాహి హోమ్ ఫుడ్ కేంద్రంలో సంప్రదాయ పిండి వంటల తయారీ విధానాన్ని తెలుసుకొని స్థానిక ఆహార సంస్కృతిని అనుభవించారు. ఈ యువజన సమ్మేళనం ద్వారా వివిధ రాష్ట్రాల యువత పరస్పర అవగాహన పెంపొందించుకోవడంతో పాటు భారతీయ సంస్కృతి వైవిధ్యాన్ని సమగ్రంగా తెలుసుకునే అవకాశాన్ని పొందుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# భీమ్‌నగర్‌లో ఘనంగా రమాబాయి జయంతి వేడుకలు





**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కు రమాబాయి ఒక బలాన్నిచ్చింది. ఆమె మద్దతు వల్లే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించగలిగారు మరియు సమాన సమాజ నిర్మాణానికి పునాది వేయగలిగారు ఎస్ కె వెంకటేష్ అన్నారు. దళిత సంఘర్ష సమితి ( భీమ్ శక్తి ) మరియు మహాదేవపుర దళిత సంఘం నేతలు నిర్వహించిన రమాబాయి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్యాగమయి రమాబాయి అంబేద్కర్ 129వ జయంతి వేడుకలు సాధారమంగల మరియు జై భీమ్ నగర్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికం వల్ల కలిగే కష్టాలు మరియు నష్టాల గురించి రమాబాయికి తెలుసు. బాబాసాహెబ్ పోరాటానికి అది ఆటంకం కలిగించకుండా ఉండటానికి ఆమె తన బాధను మింగేసింది. అంబేద్కర్ విజయాల నుండి ఆమె ప్రేరణ పొందింది. అంబేద్కర్ తో రమాదేవి చేసిన కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు జరుపుకుంటున్నారు. దీనిని ప్రతి సంవత్సరం పండుగగా జరుపుకోవాలని ఆయన అన్నారు. రమాబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలకు ఎస్ కె వెంకటేష్ ప్రత్యేకంగా చీరలను అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్ష సమితి ( భీమ్ శక్తి ) రాష్ట్ర కార్యదర్శి ఎస్ కె వెంకటేష్, మహాదేవపుర దళిత సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ విక్రమ్, సమాజ సేవకుడు ఎస్ కె మదేష్ , అష్రఫ్ అలీ, షబానా తాజ్, రేవతి రాజ్, మంజుల, మరియు తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాలో 280 మంది విద్యార్థులకు ప్రాంగణ నియామక పత్రాలు




**హన్మకొండ, ఫిబ్రవరి 7 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో భాగంగా మొత్తం 280 మంది విద్యార్థులు ప్రాంగణ నియామక పత్రాలు అందుకున్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు సురేష్ లాల్, చిర్రా రాజు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కట్ల రాజేందర్, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బిక్షాలు, ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్లు కిరణ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు ఎంపికైన విద్యార్థులను అభినందించి, లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ప్లేస్‌మెంట్ వివరాల ప్రకారం సి.ఐ.ఎస్. టెక్నాలజీ సంస్థలో 162 మంది, ఎస్.ఎం. కన్స్ట్రక్షన్ సంస్థలో 15 మంది, జీకే సంస్థలో 82 మంది, పేటియం సంస్థలో 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ప్రారంభ వేతనం రూ.1.80 లక్షల నుంచి రూ.3.00 లక్షల వరకు ఉంటుందని, పని ప్రదేశం హైదరాబాద్‌గా నిర్ణయించబడిందని ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ చిర్రా రాజు తెలిపారు. ఉద్యోగంలో చేరిన తరువాత మూడు నెలల పనితీరు ఆధారంగా వేతన పెంపు కూడా కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మెగా జాబ్ మేళా ద్వారా విద్యార్థులకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

# మాయాజాలం... విలాస జీవితం చూపించి డబ్బులు దోచుకుంటున్న కొత్త గ్యాంగ్

**నమ్మకం పేరుతో నట్టేట ముంచుతున్న మోసగాళ్లు... నగరంలో కొత్త ట్రెండ్ కలకలం**

**వరంగల్, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

నగరంలో సరికొత్త మోసం పద్ధతి వెలుగులోకి వస్తూ ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 'సౌ సారా చెటాక్ ఖారా గాళ్లు' పేరుతో కొంతమంది వ్యక్తులు విలాసవంతమైన జీవితం, ఖరీదైన దుస్తులు, చేతివేళ్లకు మెరిసే ఉంగరాలు ధరించి ఫైనాన్సర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులమని పరిచయం చేసుకుంటూ అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ తరహా వ్యక్తులు కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే ఖరీదైన వాహనాలు, ఆధునిక వస్తువులు ఉపయోగిస్తూ సంపన్నుల్లా కనిపించేలా ప్రవర్తిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పెద్దగా పరిచయం లేని వ్యక్తుల మధ్య కూడా నమ్మకం కలిగించేలా మాట్లాడటం, ప్రభావవంతమైన వ్యక్తులతో పరిచయాలు ఉన్నట్లు చెప్పుకోవడం ద్వారా ప్రజల్లో విశ్వాసం కలిగిస్తున్నారని సమాచారం. ఈ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని తక్కువ వడ్డీకి డబ్బులు తీసుకుని, నెలనెలా మంచి వడ్డీ ఇస్తామని చెప్పి పెద్ద మొత్తాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రారంభంలో కొంతకాలం పాటు క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తూ బాధితుల విశ్వాసాన్ని సంపాదించి, మరింత డబ్బు పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తున్నారని బాధితులు చెబుతున్నారు. కొంతమంది అయితే తమ పరిచయస్తులను కూడా పెట్టుబడి పెట్టేలా ఒప్పించి మరింత మొత్తాలు సేకరించిన ఘటనలు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే కొంతకాలం తరువాత అసలు డబ్బు తిరిగి ఇవ్వాల్సిన సమయం రాగానే పరిస్థితి మారిపోతుందని ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారంలో నష్టం వచ్చింది, ఫైనాన్స్ ఇచ్చిన వ్యక్తులు డబ్బులు ఇవ్వలేదు, పెట్టుబడులు చిక్కుకుపోయాయి వంటి కారణాలు చెబుతూ కాలయాపన చేస్తూ బాధితులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్నిసార్లు ఫైనాన్సర్‌కు మద్దతుగా మాట్లాడే వ్యక్తులు కూడా మధ్యలో ప్రవేశించి బాధితులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం. బాధితులు డబ్బులు అత్యవసరంగా కావాలని ఒత్తిడి చేయగా చివరకు ఎంతో కొంత మొత్తం ఇచ్చి చేతులు దులుపుకుంటున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరికొన్ని సందర్భాల్లో పూర్తిగా డబ్బులు తిరిగి రాకపోవడంతో కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిసింది. ఈ తరహా మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎవరైనా పెట్టుబడులు లేదా డిపాజిట్ల పేరుతో డబ్బులు కోరితే వారి సంస్థ చట్టబద్ధత, నమోదు వివరాలు, గత లావాదేవీలు, నమ్మకమైన ఆధారాలు పూర్తిగా తెలుసుకున్న తరువాతే డబ్బులు ఇవ్వాలని హెచ్చరిస్తున్నారు. అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.



# ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై కేసు నమోదు



**హైద్రాబాద్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో జరిగిన అగ్నిప్రమాదంపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సెంట్రల్ జోన్ పరిధిలోని ఈ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు నేర పరిశోధనలకు సంబంధించిన ఎవిడెన్స్ భద్రపరిచే కార్యాలయాల్లో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. కీలక కేసులకు సంబంధించిన ఆధారాలు, ఫైళ్లు, డిజిటల్ డేటా నిల్వ ఉంచిన విభాగాలు మంటల్లో దగ్ధమైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. నిల్వ ఉంచిన పలు మెటీరియల్ పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. అయితే ఏయే వస్తువులు దగ్ధమయ్యాయి, ఎంతమేర నష్టం జరిగింది అన్న విషయాలపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతోందని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో ల్యాబ్‌లో నలుగురు ఉద్యోగులు ఉండగా, మంటలు గమనించిన వెంటనే వారు సురక్షితంగా బయటకు వచ్చినట్లు తెలిపారు. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించిన ఒక వార్డు బాయ్‌కు స్వల్ప గాయాలు కాగా, అతడిని 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం స్థిరంగా ఉందని అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బంది ఐదు ఫైర్ ఇంజన్లతో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ అగ్నిప్రమాదం వల్ల పలు కీలక నేర పరిశోధన కేసులపై ప్రభావం పడే అవకాశముందని అధికారులు అభిప్రాయపడ్డారు. అగ్నిప్రమాదం వెనుక నిర్లక్ష్యం ఏమైనా ఉందా, భద్రతా ప్రమాణాలు పాటించారా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విచారణ పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని డీసీపీ తెలిపారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించం...

**విధులు సక్రమంగా నిర్వహించాలి**
**డిఎంహెచ్ఓ అప్పయ్య హెచ్చరిక**



**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2027(జై భీమ్ న్యూస్)**

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్య సిబ్బందంతా సమిష్టిగా నిర్వర్తించాల్సిన బాధ్యత అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. అప్పయ్య తెలిపారు. హనుమకొండలోని పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న అవుట్‌రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, మొత్తం 44 మంది పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు కలిపి 62 డోసుల వివిధ రకాల వ్యాక్సిన్లు అందించినట్లు గుర్తించారు. కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, నిర్వహణ రికార్డులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇటీవల కొంతమంది సిబ్బంది మధ్య అంతర్గత విభేదాలు తలెత్తుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి విభేదాలను పక్కనబెట్టి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ తమ విధులను సక్రమంగా నిర్వహించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే స్థాన చలనం కూడా తప్పదని హెచ్చరించారు. గర్భిణీ స్త్రీల నమోదు, వారికి నాలుగు సార్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రసవానంతరం తగిన ఫాలోఅప్ సేవలు అందించడం వంటి అంశాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన సూచించారు. అలాగే టీబీ ముక్త భారత్ అభియాన్, ఎన్సీడీ స్క్రీనింగ్ పరీక్షలు లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాల పురోగతిని వివరించారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)లో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని రామన్నపేటలో బూత్ లెవల్ అధికారుల (బిఎల్ఓ) పనితీరును డాక్టర్ అప్పయ్య పరిశీలించారు.



# విదేశీ ప్రతినిధులకు కాకతీయుల సాంస్కృతిక వారసత్వ పరిచయం





**వరంగల్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్టర్నల్ అఫైర్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న "కెపాసిటీ డెవలప్‌మెంట్ కోర్స్ ఆన్ ఫారెన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్" శిక్షణ కార్యక్రమంలో భాగంగా, 15 దేశాల నుంచి వచ్చిన విదేశీ ప్రతినిధులు కాకతీయుల సాంస్కృతిక వారసత్వాన్ని సందర్శించారు. ఫారం డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్ (ఎఫ్.డి.ఐ) అంశంపై రెండు వారాల పాటు జరుగుతున్న ఈ శిక్షణలో పాల్గొంటున్న ప్రతినిధులకు భారతదేశ సాంస్కృతి, సంప్రదాయాలు, కల్చర్ హెరిటేజ్‌ను పరిచయం చేసే ఉద్దేశ్యంతో శిక్షణలో భాగంగా కాకతీయుల కాలానికి చెందిన ప్రముఖ కట్టడాలను సందర్శింపజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయం, కాకతీయుల రాజధానిగా ప్రసిద్ధి చెందిన వరంగల్ కోట -- నార్త్ గేట్, కుసుమ మహల్, శృంగార బావి, అలాగే చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలను సందర్శించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ విదేశీ ప్రతినిధులకు కాకతీయుల చరిత్ర, వారి ఆధునిక శిల్పకళా సాంకేతికత, పరిపాలనా వ్యవస్థ, సంస్కృతి, సంప్రదాయాల గురించి సమగ్రంగా వివరించారు. కాకతీయుల కట్టడాలలోని శిల్పసౌందర్యం, నీటి నిర్వహణ విధానాలు, నిర్మాణ నైపుణ్యాలను వివరించి ప్రతినిధులను ఆకట్టుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా భారతదేశ ఆర్థిక అభివృద్ధి, విదేశీ వాణిజ్యం, పెట్టుబడుల అవకాశాలతో పాటు భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని కూడా అవగాహన చేయడం జరుగుతోంది. ఈ అధ్యయన పర్యటనలో లెబనాన్, టర్కీ, ఉజ్బెకిస్తాన్, జింబాబ్వే, ఈజిప్ట్, మొరాకో, ఎథియోపియా, టాంజానియా, లైబీరియా, మాలి, బోట్స్‌వానా, మారిషస్, గ్వాటెమాల తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.


# పండ్ల వ్యాపారిపై దాడి - ఎంజీఎం ఆసుపత్రికి తరలింపు

**హసనపర్తి, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసనపర్తి ప్రాంతంలో పండ్ల వ్యాపారిపై రాయితో దాడి చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం, శైలంరాజలింగం కాలనీకి చెందిన గోనెల నరేష్ (అయిలయ్య కుమారుడు) హసనపర్తి ప్రాంతంలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండు సంవత్సరాలుగా హసనపర్తికి చెందిన తెలం వెంకటేష్ అనే పండ్ల వ్యాపారికి వివిధ రకాల పండ్లు నిమ్మకానికి ఇచ్చినట్లు, వాటి విలువ సుమారు రూ.3 లక్షలు అవుతుందని నరేష్ తెలిపారు. అయితే డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుంటూ వస్తున్నాడని ఆయన ఆరోపించాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సుమారు 1:45 గంటల సమయంలో హసనపర్తి నిక్షయ వైన్స్ పక్కన సౌజన్య ఆటో పార్ట్స్ ఇంటి ఎదురుగా వెంకటేష్ కనిపించగా, బకాయి డబ్బుల విషయం అడగడంతో వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో వెంకటేష్ కోపంతో అక్కడ ఉన్న రాయితో నరేష్ తలపై కొట్టడంతో తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. అక్కడ ఉన్న సంగినేని కృష్ణ, కాష రాజు, సంతోష్, పెద్దమ్మ శివశంకర్‌లు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, నరేష్‌ను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

# బైక్ కొనివ్వలేదని తండ్రిని హత్య చేసిన కొడుకు

**మెదక్ జిల్లా, 7ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**



మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. బైక్ కొనివ్వలేదనే కారణంతో ఓ యువకుడు తన తండ్రిని హతమార్చిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానిక సమాచారం ప్రకారం, రేగోడ్ మండల కేంద్రానికి చెందిన షకీర్ (51) కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అతని కొడుకు మొహమ్మద్ హుస్సేన్ గత కొంతకాలంగా తనకు బైక్ కొనివ్వాలని, భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను వేధిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో నెల రోజుల క్రితం కూడా డబ్బుల విషయంలో తండ్రిపై దాడి చేయగా, గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని ఇద్దరి మధ్య రాజీ కుదిర్చినట్లు సమాచారం. అయితే శుక్రవారం రాత్రి మరోసారి వివాదం చెలరేగింది. ఇంట్లో నిద్రిస్తున్న తండ్రిని బయటకు లాక్కొచ్చి దారుణంగా కొట్టడంతో షకీర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# జై భీమ్ నగర్‌లో ఘనంగా రమాబాయి జయంతి వేడుకలు





**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కు రమాబాయి ఒక బలాన్నిచ్చింది. ఆమె మద్దతు వల్లే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించగలిగారు మరియు సమాన సమాజ నిర్మాణానికి పునాది వేయగలిగారు ఎస్ కె వెంకటేష్ అన్నారు. దళిత సంఘర్ష సమితి ( భీమ్ శక్తి ) మరియు మహాదేవపుర దళిత సంఘం నేతలు నిర్వహించిన రమాబాయి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్యాగమయి రమాబాయి అంబేద్కర్ 129వ జయంతి వేడుకలు సాధారమంగల మరియు జై భీమ్ నగర్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికం వల్ల కలిగే కష్టాలు మరియు నష్టాల గురించి రమాబాయికి తెలుసు. బాబాసాహెబ్ పోరాటానికి అది ఆటంకం కలిగించకుండా ఉండటానికి ఆమె తన బాధను మింగేసింది. అంబేద్కర్ విజయాల నుండి ఆమె ప్రేరణ పొందింది. అంబేద్కర్ తో రమాదేవి చేసిన కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు జరుపుకుంటున్నారు. దీనిని ప్రతి సంవత్సరం పండుగగా జరుపుకోవాలని ఆయన అన్నారు. రమాబాయి జయంతి వేడుకల్లో పాల్గొన్న మహిళలకు ఎస్ కె వెంకటేష్ ప్రత్యేకంగా చీరలను అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘర్ష సమితి ( భీమ్ శక్తి ) రాష్ట్ర కార్యదర్శి ఎస్ కె వెంకటేష్, మహాదేవపుర దళిత సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ విక్రమ్, సమాజ సేవకుడు ఎస్ కె మదేష్ , అష్రఫ్ అలీ, షబానా తాజ్, రేవతి రాజ్, మంజుల, మరియు తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ టర్నోవర్ పెంపుపై ఈజీఎస్ పనుల సమీక్ష

**కలెక్టర్ డాక్టర్ సత్య శారద**






**వరంగల్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ఉపాధి హామీ (ఈజీఎస్) పనులను ప్రతి గ్రామంలో ప్రారంభించి, ఎక్కువ మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న ఈజీఎస్ పనుల పురోగతిపై ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలు, ఏపీఎంలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రామరెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ ఇజ్జగిరి, హౌసింగ్ పీడీ శ్రీవాణి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల్లో కొనసాగుతున్న ఈజీఎస్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఉపాధి హామీ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేలా పనులను వేగవంతం చేయాలని, పనుల అమలులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు. హాజరు నమోదు, వేతనాల చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, కూలీలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈజీఎస్ పనుల ద్వారా ప్రతి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని, ఔషధ మొక్కలు మరియు వివిధ రకాల పూల మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలతో ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సేర్ప్‌కు సంబంధించి బ్యాంకు లింకేజ్, కొత్త సంఘాల ఏర్పాటు, స్త్రీనిధి రుణాల అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ కనెక్షన్ పొందడం సులభం

**ఫిక్స్‌డ్ ఛార్జీల విధానం అమలు**

**హైద్రాబాద్, 7 ఫిబ్రవరి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో కొత్తగా ఇళ్లకు, వ్యాపార అవసరాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం మరియు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (౧+జు=జ) ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. కొత్త నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ ఎస్టిమేషన్ల విధానాన్ని తగ్గించి ఫిక్స్‌డ్ ఛార్జీల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ నిబంధనలు ఫిబ్రవరి 5, 2026 నుండి అమల్లోకి వచ్చాయి. ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ కోసం లైన్ల దూరం, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటును బట్టి అధికారులు అంచనా వ్యయాన్ని నిర్ణయించేవారు. దీంతో వినియోగదారులు ఎక్కువ ఖర్చుతో పాటు ఆలస్యాలను ఎదుర్కొనాల్సి వచ్చేది. అయితే కొత్త విధానం ప్రకారం ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ విద్యుత్ లైన్‌కు ఒక కిలోమీటర్ లోపు ఉంటే ఎస్టిమేషన్ అవసరం ఉండదు. వినియోగదారు తీసుకునే లోడ్ ఆధారంగా నిర్ణీత రుసుము చెల్లిస్తే సరిపోతుంది. ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటుకు సంబంధించిన బాధ్యతను విద్యుత్ సంస్థలే భరిస్తాయి. కొత్త ఛార్జీల ప్రకారం గృహ అవసరాల కోసం 5 కిలోవాట్ల వరకు కనీస ఛార్జీ ?500గా నిర్ణయించారు. 5 కిలోవాట్లకు పైగా లోడ్ తీసుకుంటే నిర్ణీత రేట్ల ప్రకారం అదనపు కిలోవాట్లకు రుసుము చెల్లించాలి. వాణిజ్య అవసరాల కోసం 5 కిలోవాట్ల వరకు కనీస ఛార్జీ రూ. 1,000గా నిర్ణయించగా, అంతకు మించి లోడ్‌కు వేర్వేరు రేట్లు అమల్లో ఉంటాయి. పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్లకు కూడా ప్రత్యేకంగా ఛార్జీలు నిర్ణయించారు. వ్యవసాయ కనెక్షన్ల విషయంలో రైతులకు ప్రత్యేక ఊరట కల్పించారు. కొత్త నిబంధనల ప్రకారం వ్యవసాయ కనెక్షన్లకు కిలోవాట్‌కు కేవలం ?1,000 చెల్లిస్తే సరిపోతుంది. అవసరమైన స్తంభాలు, లైన్ల ఏర్పాటుకు సంబంధించిన అదనపు ఖర్చును విద్యుత్ సంస్థలే భరిస్తాయి. కొత్త నిబంధనల అమలుతో వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ కోసం ఎక్కువకాలం వేచి చూడాల్సిన అవసరం తగ్గుతుందని అధికారులు తెలిపారు. అదనపు డబ్బులు కోరినా లేదా ఎస్టిమేషన్ల పేరుతో ఆలస్యం చేసినా వినియోగదారులు సంబంధిత అధికారులను సంప్రదించి వివరణ కోరవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం సమీప విద్యుత్ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు తెలిపారు.




# బాల్య వివాహాల నివారణకు విద్యార్థుల్లో చైతన్యం







**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్లభాపూర్‌లో బాలికా సాధికారిత కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిషేధం, లింగ సమానత్వంపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా విద్యాశాఖ జెండర్ ఇక్విటీ కోఆర్డినేటర్ ఎస్. సునీత, గ్రామ సర్పంచ్ పొనుగంటి శ్వేత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్‌గా అంగన్వాడీ సూపర్వైజర్ కళ్యాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండర్ ఇక్విటీ కోఆర్డినేటర్ ఎస్. సునీత మాట్లాడుతూ, బాల్య వివాహాల నిరోధక చట్టం--2006 ప్రకారం బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలని తెలిపారు. బాలికకు 18 సంవత్సరాలు నిండకముందే వివాహం జరిపితే బెయిల్ రాని రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉందని వివరించారు. అలాంటి వివాహాలను చట్టబద్ధంగా రద్దు చేసి బాలికకు రక్షణ కల్పిస్తారని చెప్పారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారూ నేరస్తులేనని హెచ్చరించారు. చదువుకునే వయసులో బాలికల భవిష్యత్తును అడ్డుకోవద్దని, విద్యతోనే బాలికల జీవితంలో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ పొనుగంటి శ్వేత మాట్లాడుతూ, భారత రాజ్యాంగం స్త్రీ పురుషులకు సమాన హక్కులు, బాధ్యతలు కల్పించిందని తెలిపారు. నేటి కాలంలో మహిళలు శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష, రాజకీయ, ఆర్థిక, వ్యవసాయ రంగాలలో ప్రతిభ చాటుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. బాలికలకు వయసు రాకముందే వివాహం చేయడం వారి ప్రగతిని అడ్డుకోవడమేనని, చిన్నారులపై పెళ్లి భారం మోపకుండా వారి చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ సూపర్వైజర్ కళ్యాణి మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ 'బేటీ బచావో -- బేటీ పడావో' వంటి పథకాలను అమలు చేస్తున్నాయని, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు ఏర్పాటు చేసి బాలికల విద్యాభివృద్ధికి సహకరిస్తున్నాయని తెలిపారు. పేదరికం లేదా భద్రత కారణాల పేరుతో బాలికలకు చిన్న వయసులో వివాహం చేయవద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు. బాలికలు కూడా చదువుపై దృష్టి పెట్టి తమ లక్ష్యాలను సాధించాలన్నారు. సామాజిక మాధ్యమాల మోజులో పడి భవిష్యత్తును కోల్పోరాదని, అపరిచితులతో సన్నిహితంగా ఉండటం ప్రమాదకరమని హెచ్చరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధి సమాజ అభివృద్ధికి పునాది అని అన్నారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. విద్యార్థినులు తమ లక్ష్యాలను నిర్ణయించుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా బాలికల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, చిన్న వయసులో వివాహాలు చేయకుండా వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దాలని కోరారు. క్రమశిక్షణతో చదువుకుంటూ మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ నీరజ, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి, వెంకట సుహాసిని, రమాదేవి, పద్మలత, కళ్యాణి, శోభారాణి, అఖిల, అంగన్వాడీ సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మత్తులో దింపి... న్యూడ్ వీడియోలు తీసీ

**బ్లాక్‌మెయిల్ చేస్తూ,డ్రగ్ వ్యాపారంలోకి లాగిలి చివరికి జైలుపాలయ్యి సంచలనంగా మారిన బిలియనీర్ కూతురు వ్యవహారం**

**బెంగళూరు (జై భీమ్ న్యూస్)**

ప్రేమ పేరుతో మొదలైన పరిచయం...మత్తు పదార్థాల బానిసత్వంగా మారి...చివరికి జైలు గడపలు దాటిన ఓ బిలియనీర్ కుమార్తె కథ... బెంగళూరులో సంచలనం రేపుతోంది. బనశంకరి ప్రాంతానికి చెందిన యువతి డ్రగ్ పెడ్లర్‌గా మారిన ఈ ఘటన పూర్తి వివరాలు చూద్దాం...ప్రేమ పేరుతో మొదలైన ఒక బంధం, చివరకు మాదకద్రవ్యాల మత్తులోకి నెట్టేసి జైలువరకూ తీసుకెళ్లిన ఘటన ఇప్పుడు బెంగళూరులో సంచలనం సృష్టిస్తోంది. బనశంకరి వంటి ప్రతిష్టాత్మక ప్రాంతంలో నివసించే బిలియనీర్ వ్యాపారవేత్త కుమార్తె మేఘన (పేరు మార్చబడింది) కథ సమాజాన్ని ఆలోచింపజేస్తోంది. బీబీఎం చదువుతున్న సమయంలో మేఘన ఒక యువకుడితో ప్రేమలో పడింది. అయితే ప్రేమ ముసుగులో వచ్చిన ఆ యువకుడు ఆమెను మెల్లగా మాదకద్రవ్యాల బారిన పడేలా చేశాడు. మొదట అలవాటు, ఆ తర్వాత వ్యసనంగా మారిన డ్రగ్స్ మేఘన జీవితాన్ని పూర్తిగా మార్చేశాయి. డ్రగ్స్‌కు బానిస అయిన మేఘనను ఆమె బాయ్‌ఫ్రెండ్ క్రమంగా డ్రగ్ పెడ్లర్‌గా మార్చాడు. ఆశ్చర్యకరంగా,ఒక బిలియనీర్ కుటుంబానికి చెందిన యువతి, తాను చదువుతున్న కాలేజీ విద్యార్థులకే మాదకద్రవ్యాలు సరఫరా చేసే స్థాయికి చేరింది. చివరికి "విత్తినదే కోత" అన్నట్లు, పోలీసుల వలలో పడింది మేఘన. ప్రస్తుతం ఆమె పోలీసుల కస్టడీలో ఉండగా, ఈ కేసు యువతలో డ్రగ్స్ పెరుగుతున్న ప్రమాదాన్ని మరోసారి బయటపెట్టింది.

**మత్తులో దింపి... న్యూడ్ వీడియోలు తీసీ....**

కొంతమంది యువతులు విలాసాలు, అలవాట్ల కోసం మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారు. డ్రగ్స్ కొనడానికి డబ్బులు లేకపోయినప్పుడు, సరఫరాదారులు "ఉచితంగా డ్రగ్స్ ఇస్తాం" అనే ఆశ చూపిస్తూ.... వారిని పెడ్లింగ్ వైపు నెట్టేస్తున్నారు. డ్రగ్ పెడ్లర్లు మొదట ప్రేమ పేరుతో యువతులను వలలో పడేస్తారు. డ్రగ్స్‌కు అలవాటు చేసిన తర్వాత,మత్తులో ఉన్న సమయంలో వారి నగ్న వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తూ, డ్రగ్ వ్యాపారంలోకి లాగుతున్నారు.

**వీరు దేశానికి శత్రువులే....**

దేశానికి రెండు ప్రధాన అంతర్గత శత్రువులు ఉన్నాయంటే ... ఒకటి ఉగ్రవాదులు అయితే, రెండోది ఈ మాదకద్రవ్యాల మాఫియా అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన యువత, తల్లిదండ్రులు, సమాజం మొత్తానికి ఒక హెచ్చరికగా మారింది. ప్రేమ పేరుతో మొదలయ్యే తప్పుదారి, చివరికి జీవితం మొత్తాన్నే నాశనం చేయగలదని ఈ కథ చెబుతోంది.



# అంబేద్కర్ ఆశయాల ప్రచారం కోసం జ్ఞాన మాలాంకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి - బండి అశోక్ పిలుపు

**హన్మకొండ, 7 ఫిబ్రవరి 2026 (జై భీమ్ న్యూస్)**




హన్మకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఈ రోజు (ఫిబ్రవరి 8, ఆదివారం) ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్న జ్ఞాన మాలాంకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బండి అశోక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పాలనే ఉద్దేశంతో గత ఆరు సంవత్సరాలుగా జ్ఞాన మాలాంకరణ కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం జయంతులు, వర్ధంతులకే పరిమితం కాకుండా వారి ఆలోచనలు, సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకంగా నిలవాలనే లక్ష్యంతో ప్రతి నెల రెండవ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, విద్యా ప్రాముఖ్యత, సామాజిక న్యాయం వంటి అంశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని ఆయన తెలిపారు. యువత, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు మహనీయుల ఆలోచనలను తెలుసుకొని వాటిని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రోజు (8 ఫిబ్రవరి) నిర్వహించనున్న జ్ఞాన మాలాంకరణ కార్యక్రమానికి పూలే, అంబేద్కర్ వాదులు, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక సంస్థల ప్రతినిధులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బండి అశోక్ విజ్ఞప్తి చేశారు.